## కుంటయ్య ఆత్మహత్య ఘటనలో కాంగ్రెస్ నేతలపై కేసు

సిరిసిల్ల రూరల్, జూన్ 19 : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం దవాఖానలో జడ్జికి ఇచ్చిన మరణవాంగ్మూలంతో పాటు కుంటయ్య భార్య విజయ ఫిర్యాదుమేరకు తంగళ్లపల్లికి చెందిన కాంగ్రెస్‌నేత గంగ కిష్టారెడ్డి, సిరిసిల్లకు చెందిన మల్యాల నాగరాజుపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

## ఎస్సీ గురుకులంలో డిప్యూటేషన్లు

- గురుకులాల కార్యదర్శి అలగు వర్షిణి ఆదేశాలు

హైదరాబాద్, జూన్19 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకుల సొసైటీలోని సిబ్బందిని ఒకేసారి డిప్యూటేషన్లపై పంపారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తాజాగా ఆదేశాలను జారీచేశారు. బాలికల గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న 57 మంది పురుష సిబ్బందిని డిప్యూటేషన్‌పై వేరొక గురుకులానికి పంపించారు. అదేవిధంగా సొసైటీ పరిధిలోని ఇంటర్ గురుకుల కాలేజీల్లో మారిన గ్రూపులకు అనుగుణంగా 89 మంది జూనియర్ లెక్చరర్లను డిప్యూటేషన్లపై నియమించారు. సొసైటీ తీసుకున్న ఆయా నిర్ణయాలపై గురుకుల సిబ్బంది నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

## టీబీఐతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం

హైదరాబాద్, జూన్19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైజింగ్ విజన్ డెవలప్‌మెంట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం, టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు సీఎంవో కార్యాలయం ప్రకటించింది. గురువారం ఢిల్లీలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. దాదాపు ఇద్దరి మధ్య గంట పాటు సంభాషణ జరిగినట్టు తెలిపింది. తెలంగాణ రైజింగ్ 2047 కార్యక్రమ వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి మాజీ ప్రధాని బ్లెయిర్‌కు వివరించారని పేర్కొన్నది.

# కాళేశ్వరాన్ని కాదని.. శనేశ్వరానికి అనుమతా?

- 245 కోట్లతో పాలేరు లిఫ్ట్‌కు గ్రీన్‌సిగ్నల్
- ఉన్న నీటికి గండికొట్టి.. లేని నీటికి లిఫ్ట్ మంజూరు
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాళేశ్వరం నీళ్లు బంద్
- తగ్గిపోతున్న సాగర్ జలాలతో నూతన లిఫ్ట్ నిర్మాణం
- కమీషన్ల కక్కుర్తి కోసమే ఇదంతా అని నిపుణుల ఆరోపణ



సూర్యాపేట జిల్లాలో పారుతున్న కాళేశ్వరం జలాలు(ఫైల్)

సూర్యాపేట, జూన్ 19 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల తరబడి నీటి చుక్కకు నోచని కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టును గాలికొదిలేసి ఏటేటా నీటి మట్టం తగ్గిపోతున్న నాగార్జునసాగర్ దిగువన ఉన్న పాలేరు రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే రూ.245 కోట్ల వ్యయంతో లిఫ్ట్ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ జీవో జారీ చేశారు. కేవలం ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న పాలేరు రిజర్వాయర్ నుంచి ఇప్పటికే భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ కింద 20 వేల ఎకరాలు ఉండగా, మిషన్ భగీరథ ద్వారా ఖమ్మం జిల్లాలోని సగ భాగంతోపాటు సూర్యాపేట జిల్లాలోని 5 మండలాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాలేరు రిజర్వాయర్ నుంచి మరో 45 వేల ఎకరాలకు 4.5 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యమయ్యే పనికాదని అంతర్గతంగా ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్తున్నారు. కేవలం కమీషన్ల కోసమే ఈ లిఫ్ట్ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లులేక ఎడారిగా మారిన సూర్యాపేట జిల్లా పరిధిలోని ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2 ఆయకట్టుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం జలధారగా మారింది. 2018 నుంచి సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయణించి సూర్యాపేటకు కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు చేరుకోవడంతో ఇంచు భూమి లేకుండా సాగులోకి వచ్చింది. దాదాపు ఆరేండ్లపాటు అంటే 2023 వరకు రెండు పంటలను పండించుకున్న రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. రెండేండ్లుగా నీరందక లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తామేదో సాధిస్తామంటూ అక్కరకు రాని ఓ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రూపొందించి పనులు ప్రారంభిస్తుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

### ఏటేటా తగ్గుతున్న సాగర్ జలాలు

గత కొద్ది సంవత్సరాలుగా నాగార్జునసాగర్‌లోని నీటిమట్టం తగ్గుతూ వస్తున్నది. అలాంటిది సాగర్ దిగువన ఉన్న పాలేరు ప్రాజెక్టుకు నీళ్లు ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారిది. 2023లో సాగర్ ఎడమకాల్వ కింద సాగునీటికి ఇబ్బందులు రాగా, 2024లో అంతంత మాత్రంగానే అందాయి. కృష్ణా నది డెడ్ స్టోరేజ్ 510 అడుగులు కాగా, గత రెండేండ్లుగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 520 నుంచి 530 అడుగులకు మించి నమోదుకాలేదు. 2023లో 520 అడుగుల మేర ఉండగా, 2024లో 504, ప్రస్తుత 2025లో 511 అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో కృష్ణా నది భవిష్యత్తులో ఎలా ఉంటుందో తెలియదు కానీ, ఆ నీటిపై ఆశలు పెట్టుకొని కొత్త ఆయకట్టు సృష్టించడం చాలా కష్టతరమని ఇరిగేషన్ శాఖ అధికారులే చెప్తున్నారు. అయినా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన పాలేరు నుంచి రూ.245 కోట్ల వ్యయంతో 45వేల ఎకరాలకు నీటిని అందించే లిఫ్ట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ జీవో చేశారు. దీని ద్వారా నీటిని ఎలా అందిస్తారో ఆ దేవుడికే తెలియాలనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇప్పటికే పాలేరు రిజర్వాయర్ నుంచి ఖమ్మం జిల్లాలోని భక్తరామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ కింద 20 వేల ఎకరాలు సాగవుతుండగా మరోపక్క సగ భాగం ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట జిల్లాలోని ఐదు మండలాలకు మిషన్ భగీరథతో తాగునీటిని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలేరు రిజర్వాయర్ నుంచి మోతె, మునగాల, నడిగూడెం మండలాల పరిధిలోని 45 వేల ఎకరాలకు 4.5 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యమయ్యే పనికాదని అంతర్గతంగా ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్తుండగా కేవలం కమీషన్ల కక్కుర్తి కోసమే ఈ లిఫ్ట్ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిరుడు సూర్యాపేట జిల్లా పరిధిలోని తూములకు షట్టర్లు బిగించి ఎత్తకుండా వెల్డింగులు చేసి మరీ నీటిదోపిడీకి పాల్పడి ఖమ్మం జిల్లాకు తరలించిన విషయం విదితమే. అయినా పాలేరు వద్ద లిఫ్ట్ ఏర్పాటుచేస్తే భవిష్యత్తులో నీటి పంచాయితీలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

### మేడిగడ్డ మరమ్మతులే ఉత్తమం

గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని మేడిగడ్డ వద్ద చిన్నపాటి కుంగుబాటును కాంగ్రెస్ ప్రభుత్వం బూచిగా చూపిస్తూ వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏడాదిన్నరగా మరమ్మతులు చేపట్టకుండా గాలికి వదిలేసింది. ఇప్పుడు అలవికాని చోట లిఫ్ట్ ఏర్పాటు చేయడం కంటే నిజంగా రైతులపై ప్రేమ ఉంటే, సాగునీటిని అందించాలనే తపన ఉంటే కమీషన్ల కోసం కక్కుర్తి పడకుండా మేడిగడ్డ వద్ద కుంగిన ఒకటి రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. తద్వారా మళ్లీ కాళేశ్వరం జలాలు జిల్లాకు చేరి మేలు జరుగుతుందని రైతులు ధృడంగా నమ్ముతున్నారు. అక్కడ ఒక్కో పిల్లర్ నిర్మాణానికి రూ.100 నుంచి 150 కోట్ల వరకు అవుతుందని ఇంజనీర్లు అంచనా వేస్తుండగా, కుంగిన నాలుగు పిల్లర్లకు రూ.400 నుంచి రూ.600 కోట్లకు మించి ఖర్చు కావని తేల్చి చెప్తున్నారు. అంతకు మించి వ్యయం అయినా ప్రభుత్వం ఆ నిధులు వెచ్చించాలే తప్ప, గాలికి వదిలేయడం రైతాంగాన్ని నట్టేట ముంచడమే అవుతుంది. నీళ్లు సరిపడా లేని పాలేరు వద్ద రూ.245 కోట్లతో లిఫ్ట్ ఏర్పాటుచేసే బదులు మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేపట్టడమే ఉత్తమమని నిపుణులు తేల్చి చెప్తున్నారు.

## 'హెచ్‌సీయూ' కేసుల ఎత్తివేత ఏమైంది?

- న్యాయస్థానం బెయిల్‌తో బయటకు వచ్చిన విద్యార్థులు
- కేసులను కొట్టివేస్తామని రెండు నెలల కిందట డిప్యూటీ సీఎం హామీ
- పోలీసులకు ఆదేశాలివ్వని సర్కార్, ఇంకెప్పుడిస్తరని విద్యార్థుల ప్రశ్న

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలి అడవుల నరికివేతకు వ్యతిరేకిస్తూ ఆందోళనలో పాల్గొని అరెస్టయిన విద్యార్థులపై కేసులు ఎత్తివేస్తామన్న ప్రభుత్వ హామీ అమలుకు నోచుకోవడంలేదు. ఇప్పుడే పోలీసులకు ఆదేశాలు ఇస్తున్నానంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క విద్యార్థులతో మాటలు చెప్పి రెండు నెలలు గడుస్తున్నది. కేసుల విషయంలో ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పోలీసులు చెప్తున్నారు. సర్కారు నిర్లక్ష్యంతో నిరీక్షణ తప్పడడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రకృతిపై విధ్వంసాన్ని అడ్డుకున్న తమపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడమేంటని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా అక్రమంగా పెట్టిన కేసులను కొట్టేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### కోర్టు చుట్టూ ప్రదక్షిణలు

హెచ్‌సీయూ ప్రాంగణంలో చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు ఎర్రం నవీన్, రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బీఎన్ఎస్ 118 (1), 132, 191 (3), 329 (3), 351(3) సెక్షన్ల కింద కేసులు పెట్టారు. వీరితో పాటు 54 మందిపై బీఎన్ఎస్ 170 సెక్షన్ కింద గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కంది జైలులో 15 రోజులు ఉన్న తర్వాత ఎర్రం నవీన్, రోహిత్ బెయిల్‌పై బయటకు వచ్చినా విచారణ కోసం కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.






## కాంగ్రెస్ నాయకుల నుంచి రక్షణ కల్పించండి

- బోనకల్లు ఠాణా ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తలు, బాధితుల ఆందోళన

బోనకల్లు, జూన్ 19 : కాంగ్రెస్ నాయకుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు, బాధితులు ఖమ్మం జిల్లా బోనకల్లు పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మడుపల్లి వెంకటేశ్వర్లు వారం క్రితం ఆటోలో వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దప్రోలు సైదులు, అతడి కుమారుడు కార్తీక్ ఆటోను ఆపి ఇనుపరాడ్‌తో వెంకటేశ్వర్లుపై దాడిచేశారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా విచారణ చేపట్టకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.



ఖమ్మం జిల్లా బోనకల్లు ఠాణ ఎదుట ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు, బాధిత కుటుంబసభ్యులు


Central Government
Institute of Hotel Management Catering Technology & Applied Nutrition
IHMH Institute of Hotel Management Hyderabad
(An Autonomous body under the Ministry of Tourism, Govt. of India)
F-Row, D.D. Colony, Vidyanagar, Hyderabad - 500 007 (Telangana). Phone: 040-27427569
Mobile: 83747 87988, e-mail: ihmhyd.principal@gmail.com Website: www.ihmhyd.org.

Admissions are in Progress for 2025-2026

Craftsmanship Course in Food Production & Patisserie (Cookery & Bakery) Duration: 18 Months

Last date 10th July, 2025

NO RESTRICTION ON UPPER AGE LIMIT FOR ADMISSIONS
100% Job Placement Assistance (India & Abroad)

For updates on all the courses www.ihmhyd.org (or) scan the QR Code

For further Details
Please visit campus: between 10.00 am to 5.00 pm from Monday to Friday
Visit our college website : www.ihmhyd.org
Write e-mail to: ihmhyd.principal@gmail.com for more information


# 'జల' హక్కులు బాబుకు తాకట్టు

- గోదావరి, కృష్ణాలో కలిపి 1500 టీఎంసీలు చాలన్న రేవంత్ రెడ్డి
- ఆపై జలాలను ఏపీ తరలించినా అభ్యంతరం లేదన్న ముఖ్యమంత్రి
- చంద్రబాబును ఒప్పించి ఎన్వోసీ ఇప్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- బనకచర్ల కంటే మూసీ నదిపైనే మక్కువ చూపిన రేవంత్ బృందం



కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం గోదావరి నదిలో 968 టీఎంసీల వినియోగానికి తెలంగాణకు హక్కులు ఉన్నాయి. కృష్ణా నదిలో 575 టీఎంసీలకు పైగా రావాలని ట్రిబ్యునల్ ఎదుట వాదనలకు జరుగుతున్నాయి. అంటే 1543 టీఎంసీలపై రాష్ట్రానికి జలహక్కులు దాదాపుగా ఉన్నట్టే. ఒకవేళ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల పట్ల, రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. గోదావరిలో 3000 టీఎంసీల మేర వరద పారుతున్నది కాబట్టి అందులో సగం, అంటే 1500 టీఎంసీల వాటా కావాలని కేంద్రంతో కొట్లాడాలి. కృష్ణా జలాల్లో కోరిన వాటా దక్కేలా పోరాడాలి. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రెండు నదుల్లో కలిపి తెలంగాణకు కేవలం 1500 టీఎంసీలు చాలని, మిగతా నీటిని ఏపీ తరలించుకపోయినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. అంటే.. ఇప్పుడున్న వాటాకన్నా 40 టీఎంసీలు తగ్గించుకొని, జలహక్కులను ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు తాకట్టు పెట్టారని సాగునీటి రంగ విశ్లేషకులు మండిపడుతున్నారు.

### బాబు నిరభ్యంతర పత్రం ఇవ్వాలట

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నీటిపారుదల సలహాదారు ఆధిత్యనాథ్ దాస్ తదితరులతో కూడిన బృందం గురువారం ఢిల్లీకి వెళ్లింది. కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాల విజ్ఞప్తి చేసింది. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరుతో రాష్ట్ర ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని సీఎం చెప్పారు. ట్రిబ్యునల్ అనుమతులకు విరుద్ధంగా పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతున్నదని ఆరోపించారు. జాతీయ ప్రాజెక్టు విషయంలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్రం దృష్టి సారించాలని కోరారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. గోదావరి నదిలో వెయ్యి టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణ వాడుకునేందుకు అనుమతి ఇప్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఇందుకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు ఎన్ని నీళ్లు తీసుకుపోయినా తమకు అభ్యంతరం లేదని కేంద్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. దీనిపై సాగునీటి రంగ నిపుణులు మండిపడుతున్నారు. ఏపీ ప్రభుత్వం వదర జలాల పేరుతోనే బనక చర్లను కట్టాలని చూస్తున్న సంగతి తెలిసిందే. ఇదే వరద జలాల సూత్రంపై ఆధారపడి గోదావరి జలాల్లో సగం వాటా కోసం కొట్లాడాల్సింది పోయి కేవలం 32 టీఎంసీలు అదనంగా అడగడం ఏమిటంటూ నిలదీస్తున్నారు. అంటే గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుకు తెలంగాణ సీఎం ఎన్వోసీ ఇచ్చినట్టే అని అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రకటన వెనుక చంద్రబాబు మంత్రాంగం ఉన్నదని ఆరోపిస్తున్నారు. గోదావరి నదీ జలాలను ఆయన దర్జాగా దారి మళ్లించి కృష్ణా బేసిన్‌లోని బకనచర్లకు పట్టుకొని పోవాలని చూస్తుంటే, తెలంగాణ సీఎం మాత్రం మన హక్కు కింద వచ్చే జలాలను వాడుకోవటానికి చంద్రబాబు వద్ద నుంచి నిరంభ్యంతర పత్రం ఇప్పించాలని కేంద్రాన్ని ప్రాధేయపడటం ఏమిటని జలరంగ నిపుణులు, తెలంగాణ రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాలో ఒకవైపు 575టీఎంసీలకుపైగా రావాలని ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలకు వినిపిస్తున్నదని, ఇలాంటి సమయంలో 500 టీఎంసీలు ఇస్తే బనకచర్లకు అభ్యంతరం తెలపబోమని రేవంత్ రెడ్డి చెప్పడం చూస్తుంటే ఆయన ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని జల రంగ నిపుణలు ఆరోపిస్తున్నారు.

### ఎవరిని ముంచేందుకు ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్


ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో తాము చర్చకు సిద్ధమని సీఎం వెల్లడించారు. దీంతో ఆయన విశ్వసనీయతపై అనుమానం కలుగుతున్నదని జలరంగ నిపుణులు అంటున్నారు. ఇచ్చంపల్లి చేపట్టడమంటే తెలంగాణను ముంచడమేనని స్పష్టం చేస్తున్నారు. మరి ఎవరిని ముంచి నీళ్లను ఏపీకి మళ్లించేందుకు సీఎం ఈ ప్రతిపాదన చేశారో అర్థం కావటం లేదన్నారు. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ట్రిబ్యునల్-2 ఎదుట ఇరు రాష్ట్రాల వాదనలు కొనసాగుతున్న వేళ సీఎం ఈ ప్రతిపాదన ఇవ్వడం అంటే తెలంగాణ హక్కులకు నీళ్లు వదలటమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య విచారణ త్వరగా పూర్తి చేసి ఒకేసారి అవార్డు ప్రకటించాలని ఎప్పటి నుంచో డిమాండ్లు ఉన్నాయి. కానీ దానికి విరుద్ధంగా సీఎం వ్యవహరించడంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### మూసీ మీదనే మక్కువ

కేంద్ర మంత్రిని కలిసిన సందర్భంలో సీఎం రేవంత్ బనకచర్ల ప్రాజెక్టును నిలవరించటం కంటే మూసీ ప్రక్షాళనకు నిధుల సాయం మీదనే ఎక్కువ శ్రద్ధ పెట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఏపీ అడిగిన వెంటనే ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తున్నారని, తెలంగాణకు మాత్రం ఇవ్వటం లేదని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. మూసీ ప్రక్షాళనకు విజ్ఞప్తి చేస్తున్నా కేంద్రం స్పందించలేదని, గంగా, యమునా ప్రక్షాళనకు ఇచ్చినట్టే మూసీకి నిధులివ్వాలని ఇవ్వాలని కోరారని తెలిసింది.

# ఈటల సవాల్.. జవాబ్ దో రేవంత్!

- క్యాబినెట్ అనుమతితోనే కాళేశ్వరం
- ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ పంపిస్తా..
- లేదని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పకుంటా
- సీఎం వ్యాఖ్యలపై ఎంపీ ఈటల ఫైర్



బొల్లారం, జూన్ 19 : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉన్నదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కుండబద్దలు కొట్టారు. క్యాబినెట్ ఆమోదం లేకుండానే అంత భారీ ప్రాజెక్టును ఏ ప్రభుత్వమైనా నిర్మిస్తుందా? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అసలు క్యాబినెట్ ఆమోదమే లేదని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు బీజేపీ ఎంపీ దీటైన సమాధానమిచ్చారు. కంటోన్మెంట్‌లోని ఇంపీరియల్ గార్డెన్లో ఎంపీ ఈటల రాజేందర్ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ నిర్ణయాన్ని కూడా సొంతంగా అమలు చేయలేదని స్పష్టంచేశారు. క్యాబినెట్ ఆమోదం లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల వాఖ్యలను ఉటంకిస్తూ ఇప్పుడున్న ముగ్గురు మంత్రులు కూడా నాటి క్యాబినెట్‌లో ఉన్నారని, వారి సమక్షంలోనే క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బట్ట కాల్చి మీద వేయడం సరికాదని హితవుపలికారు. 'మీ శాఖలో ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా క్యాబినెట్లో పెట్టండని మంత్రులకు కేసీఆర్ చెప్పేవారు.. కాదంటే నేను దేనికైనా సిద్ధం.. లేదని తేల్చితే నేను రాజకీయాల నుంచే తప్పుకుంటా' అని సవాల్ విసిరారు. 'అనేక ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మొదలుపెట్టారు గానీ పూర్తి చేయలేదు. ఐదేండ్లలో పూర్తిచేయాల్సిన ప్రాణహిత-చేవెళ్ల కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేదు. పోతిరెడ్డిపాడు పేరుతో అన్యాయంగా మన నీళ్లను తరలించుకుపోతుంటే దుర్మార్గమని చెప్పి పులిబిడ్డలా రాజశేఖర్‌రెడ్డితో కొట్లాడింది.. నేనే' అని గుర్తుచేశారు.

### ప్రజల మీదనే సీఎం దౌర్జన్యం

రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఓట్లు వేసిన ప్రజల మీదనే దౌర్జన్యం చేస్తూ అన్యాయానికి ఒడిగట్టాడని ఈటల తీవ్ర విమర్శలు చేశారు. అందులో మొదటిది హైడ్రా అని, హైడ్రాతో సమాజాన్ని ఉద్ధరిస్తానని చెప్పి అనేక మంది పేదల ఇండ్లను కూలగొడుతున్నారని మండిపడ్డారు. బాధితులు ఏడ్చినా ఈ ప్రభుత్వానికి కనికరం రాలేదని ఫైర్ అయ్యారు. 'ప్రభుత్వం ప్రజల కన్నీళ్లు తుడవాలి గానీ, ఈ ప్రభుత్వం ప్రజలకు కన్నీరు పెట్టిస్తున్నది. మూసీ ప్రక్షాళన పేరిట రియల్ వ్యాపారం కోసం కాలనీలను కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు.


## అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ కంటే మెరుగ్గా రాణించిన NIAT తో శిక్షణ పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులు

'మ్యాట్రిక్స్ ప్రోటోకాల్' ఏఐ హ్యాకథాన్‌లో అరుదైన ఘనత. టాప్-10లో చోటు దక్కించుకున్న విద్యార్థులు



హైదరాబాద్, జూన్ 20: ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న NIAT (NXTWAVE INSTITUTE OF ADVANCED TECHNOLOGIES) ఫస్ట్ ఇయర్ విద్యార్థుల బృందం, జాతీయ స్థాయిలో జరిగిన 'ది మ్యాట్రిక్స్ ప్రోటోకాల్' AI హ్యాకథాన్ ఫైనల్ రౌండ్‌కి ఎంపికైన టాప్-10 టీమ్స్‌లో ఒకటిగా నిలిచింది. ఈ 48 గంటల ఫిన్టెక్ ఇన్నోవేషన్ స్ప్రింట్‌ను భారతదేశంలోనే అగ్రస్థానంలో ఉన్న పియర్-టు-పియర్ లెండింగ్ ప్లాట్‌ఫారమ్ లెన్‌డెన్‌క్లబ్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (AWS) సహకారంతో జూన్ 13 నుంచి 15 వరకు ముంబయిలో నిర్వహించారు. ఈ పోటీలో భాగంగా పాల్గొన్నవారు, నిత్య ఆదాయం లేని వ్యక్తులకోసం ఏఐ ఆధారిత క్రెడిట్ స్కోరింగ్ మోడల్స్ రూపొందించాల్సిన ఛాలెంజ్ ఎదురుకున్నారు. ఇది ప్రస్తుత ఫిన్టెక్ రంగంలో ఒక పెద్ద సమస్యగా పరిగణించబడుతోంది.

ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌కు భారతదేశం నలుమూలల నుంచే కాదు, ఆస్ట్రేలియా, బ్రెజిల్, జర్మనీ, నేపాల్, పెరూ, సౌదీ అరేబియా లాంటి దేశాల నుంచి కలిపి మొత్తం 1,800 మందికి పైగా పాల్గొన్నారు. ఆన్‌లైన్ రౌండ్ చాలా కఠినంగా ఉండటంతో, చివరికి టాప్ 150 సమస్య పరిష్కర్తలకు ముంబయిలో జరిగే ఆఫ్‌లైన్ ఫైనల్స్‌కి ఎంపిక చేశారు. వీరిలో ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, ఐఎస్ఐ లాంటి అగ్ర విద్యాసంస్థల విద్యార్థులతో పాటు, కాగ్నిజెంట్, మోర్గాన్ స్టాన్లీ, టెక్ మహీంద్రా, ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, ఈఎక్స్ఎల్, వొడాఫోన్ ఐడియా, ఒరాకిల్, జేపీ మోర్గాన్ చేస్, ఎంఎల్ ఎక్స్‌పర్ట్స్ ఏఐ, లాంటి దిగ్గజ సంస్థల టెక్నాలజీ నిపుణులు కూడా ఉన్నారు.

ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న NIAT విద్యార్థులు జాతీయ ఫిన్టెక్ హ్యాకథాన్‌లో తొలిసారిగా పాల్గొన్నారు. కానీ ఆ మొదటి ప్రయత్నమే గొప్ప విజయాన్ని అందించింది. అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్, ఫ్రీలాన్స్ డెవలపర్లు, స్టార్టప్ ఫౌండర్ల తో పోటీపడి టాప్-10 లో చోటు దక్కించుకున్నారు.

NIAT ఫ్యాకల్టీ, ఆలుమ్నీ మెంటార్ల మార్గదర్శకత్వంలో విద్యార్థులు స్థిరమైన ఆదాయం లేని వ్యక్తుల కోసం వారి ఆదాయాన్ని అంచనా వేసే ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మోడల్ తయారు చేశారు. ఇది వారికి రీపేమెంట్ క్రెడిట్ స్కోర్‌ను జెనరేట్ చేస్తుంది. ఈ సిస్టమ్ ఆధారంగా బ్యాంకులు, సంస్థలు త్వరగా రుణ నిర్ణయాలు తీసుకోగలుగుతాయి. "జాతీయ హ్యాకథాన్‌లో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లకు అసలు అవకాశం ఉంటుందా? అనేదే మాకు మొదట్లో సందేహంగా అనిపించింది. కానీ ఫైనల్ డెమో జరిగే సమయానికి ఇండస్ట్రీ మెంటార్లు మా కోడ్ చూడాలని అడగడం మాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చింది," అంటున్నారు ఫస్ట్ ఇయర్ విద్యార్థి వేగా దర్శి.

నెక్స్ట్‌వేవ్ మరియు NIAT సీఈఓ & కో-ఫౌండర్ రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ "ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు అనుభవజ్ఞులతో పోటీపడి జాతీయ స్థాయిలో టాప్-10 లో నిలవడం అనేది NIAT ట్రైనింగ్, మెంటార్ షిప్ యువతలో అగ్రశ్రేణి నైపుణ్యాలను ఎంత త్వరగా అభివృద్ధి చేయగలదో చూపించే బలమైన ధృవీకరణ," అని తెలిపారు.

భవిష్యత్తును ఎదుర్కొనేందుకు మాత్రమే సన్నద్ధపరచకుండా వారు భవిష్యత్తుకు నాయకత్వం వహించేలా విద్యార్థులను సిద్ధం చేస్తుంది NIAT. 'ది మ్యాట్రిక్స్ ప్రోటోకాల్'లో టాప్-10 లో స్థానం దక్కించుకోవడం అనేది విద్యార్థుల నేతృత్వంలోని విజయాలు పెరుగుతున్న జాబితాలో చేరుకుంది. ఇప్పటికే NIAT ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు ముంబై టెక్ వీక్‌లో వారి నైపుణ్యం నిరూపించుకున్నారు, టి-హబ్‌లో జరిగిన బిజినెస్ హ్యాకథాన్‌లో విజయంతో పాటు పలు హ్యాకథాన్ లలో విజయం సాధించారు.

కపిల్ కావురి హబ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, తెలంగాణ, 500032

NIAT NxtWave Institute of Advanced Technologies